ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025





శనివారం రాత్రి సీఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు పలుకుతున్న దృశ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు లోకేశ్, టీజీ భరత్, నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, దుర్గేశ్, సంధ్యారాణి, పారిశ్రామికవేత్తలు





సీఐఐ అధ్యక్షుడు రాజేంద్ర మోమానీని సత్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

సదస్సు సూపర్ సక్సెస్

అందరిలోను ఆనందోత్సాహాలు
అంచనాలకు మించి పెట్టుబడులు రాక

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన రెండు రోజుల సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు సూపర్ సక్సెస్ అయింది. సీఐఐ చరిత్రలో ఇంతవరకు ఏ సదస్సు ఈ స్థాయిలో విజయవంతం కాలేదని స్వయంగా ముఖ్యమంత్రే వెల్లడించారు. ఊహించిన దానికంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు రావడం, ఆహ్వానించిన వారంతా తరలిరావడం, అందరికీ అతిథి మర్యాదలు బాగా జరగడంతో అందరిలోను సంతృప్తి కనిపించింది.

ప్రతి ఒక్కరూ నిర్వహణ, ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసలు కురిపించారు. ఈ సదస్సు కోసం జిల్లా అధికారులు నెల రోజుల ముందునుంచి కసరత్తు ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పొరుగు జిల్లా మంత్రులు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా దగ్గరుండి ఏర్పాట్లు చూసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించుకుంటూ లోపాలను సరిదిద్దుకున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పోలీసులు ఎక్కడా అతిగా ప్రవర్తించకుండా ముందుగానే హెచ్చరికలు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. రెండు రోజుల సదస్సు పూర్తిగా విజయవంతం కావడంతో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అధికారులను, స్థానిక నాయకులను శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఆ ఉత్సాహంతోనే వచ్చే సదస్సు కూడా నవంబరు 2026లో ఇక్కడే నిర్వహిస్తామని చంద్రబాబు ప్రకటించారు.



రాయలసీమలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన రేమండ్ గ్రూపు ప్రతినిధులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు ప్రాధాన్యం

ఈ విషయంలో అపోహలు పెట్టుకోవద్దు

- లూలూ షాపింగ్ మాల్ కాదు.. ఎక్స్‌పీరియెన్స్ సెంటర్
- ఉమ్మడి విశాఖలోనే అధిక స్టీల్ ఉత్పత్తి
- తూర్పు తీరం నుంచి పశ్చిమ తీరానికి పోర్టు కనెక్టవిటీ
- స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని ఇంటింటికీ వెళ్లి చెప్పాలా?
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

కొత్తగా వచ్చే ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు అధికంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, ఈ విషయంలో అపోహలు పెట్టుకోవద్దని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు ముగిసిన తరువాత శనివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విలేకరి ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇస్తున్నారని సీఎం దృష్టికి తీసుకురాగా అందులో వాస్తవం లేదన్నారు. కొత్తగా వచ్చిన టీసీఎస్, కాండ్యుయెంట్ కంపెనీలన్నీ ఏపీ యువతనే తీసుకుంటున్నాయని ఐటీ శాఖా మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ గూగుల్‌కు కూడా ఇదే సదస్సులో ... మిగతా 8వ పేజీలో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

బిందు సేద్యం వైపు మొగ్గు

- రాయితీపై పరికరాలు అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఆసక్తి చూపుతున్న రైతులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బిందు, తుంపర్ల సేద్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. పలు మండలాల్లో పండ్లు, పూల తోటలు సాగు చేస్తుండగా, మిగిలిన అన్ని మండలాల్లో కూరగాయల సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కాగా ప్రభుత్వం జిల్లాలో 2025-26 సంవత్సరానికి రూ.16.32 కోట్లతో 2 వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు రూ.12 కోట్లు రాయితీని ప్రకటించింది.



జిల్లాలో అక్టోబరు నెలాఖరు వరకు బిందు, తుంపర్ల సేద్యం కోసం 2,276 మందికిపైగా రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటి వరకు 1,035 హెక్టార్లలో సాగు చేసేందుకు 1,004 రైతుల దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇందులో అన్ని అర్హతలున్న 270 మందికి సుమారు 249 హెక్టార్లలో సాగు చేసేందుకు ఆమోద ముద్ర వేశారు. ఇందులో 172 మంది రైతులకు బిందు, తుంపర్ల సేద్య రాయితీ పరికరాలను అందజేశారు. జిల్లాకు ఆరు మైక్రో ఇరిగేషన్ కంపెనీలను కేటాయించి రాయితీ పరికరాలను పంపిణీ చేస్తున్నారు.



బిందు సేద్యం చేస్తున్న రైతులకు సలహాలు అందిస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో) పరవాడ మండలంలోని వాడచీపురుపల్లిలో బిందు సేద్యం

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

బిందు, తుంపర్ల సేద్యం చేసేందుకు రైతుల నుంచి అన్ని రైతు సేవా కేంద్రాల్లో, మండల అభివృద్ధి కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. దరఖాస్తుతో భూమి హక్కుపత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, భూమి ఎఫ్‌ఎంబీ, నీటి వనరులైన బోరు, బావి, సమీపంలో పంట కాలువ ఉన్నా ఆ వివరాలు జోడించాల్సి ఉంటుంది. బిందు సేద్యం చేసేందుకు చేసిన దరఖాస్తులను ... మిగతా 8వ పేజీలో

వెజి(ట)బుల్

భారీ వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంటలు

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- సెంచరీ దాటిన కిలో నల్ల వంకాయలు



కూరగాయలు

గత వారంతో పోలిస్తే ప్రస్తుతం కూరగాయల ధరలు ఇలా...

కూరగాయలు	గత నెల కిలో రూ.	ప్రస్తుతం కిలో రూ.
బీరకాయలు	80	80
బెండకాయలు	60	70
దొండకాయలు	60	70
చిక్కుడుకాయలు	70	80
టమాటా	40	50
కాకరకాయలు	50	70
ఆనపకాయ	40	50
వంకాయలు	70	80
నల్లవంకాయలు	80	120
బరబాటి	40	70
బీన్స్	70	80

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి పట్టణంలోని మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వారం రోజుల క్రితంతో పోలిస్తే ఇప్పుడు ధరలు పెరిగాయి. నల్ల వంకాయలు ధర కిలో సెంచరీ దాటింది. ఆకు కూరల ధరలైతే భారీగానే పెరిగాయి. తుఫాన్ ప్రభా వం వలన జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో కూడా భారీగా వర్షాలు కురవడంతో కూరగాయల పంటలు బాగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో ప్రతి ఇంటా కూరగాయల వినియోగం బాగా పెరిగింది. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు అధికంగా ఉండడం, శుభాకార్యాలు జరుగుతుండడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం అనకాపల్లి మార్కెట్‌కు సికింద్రాబాద్, రావులపాలెం, మడిక తదితర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు కూరగాయలు దిగుమతి అవుతున్నాయని వర్తకులు చెబుతున్నారు. ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి వంకాయలు, చిక్కుడుకాయలు, కీర, కాకరకాయలు, క్యాప్సికమ్‌లు దిగుమతి అవుతున్నాయి.

బీఎన్ రోడ్డు కేసు 22కి వాయిదా

- రాష్ట్ర ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి హాజరు కావాలని జిల్లా జడ్జి ఆదేశం

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

బీఎన్ రహదారి పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానిక న్యాయవాది కాండ్రేగుల డేవిడ్‌తో పాటు మరో ముగ్గురు న్యాయవాదులు దాఖలు చేసిన కోర్టు కేసు విచారణ ఈ నెల 22కి వాయిదా పడింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శనివారం వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.హరినారాయణ సెప్టెంబరు 27న నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే మూడు సార్లు ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు కోర్టు ఎదుట హాజరై, రోడ్డు పనుల్లో అలసత్వానికి కారణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేనని, ఇది ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని వివరణ ఇవ్వడంతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని జిల్లా జడ్జి ఆదేశించారు. అయితే జిల్లా జడ్జి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లడంతో ఈ కేసు ఈ నెల 22వ తేదీనికి వాయిదావేశారు.

రైతు బజారు గతి ఇంతేనా?

రైతులు, వినియోగదారులకు మేలు చేకూర్చేందుకు 14 ఏళ్ల క్రితం నిర్మాణం

- తొలినాళ్లలో ఆదరణ.. నిర్వహణ లేక క్రమేపీ కళావిహీనం
- పదేళ్ల క్రితం మూసివేత
- ప్రస్తుతం ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో అధ్వానం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు, ప్రజలకు నాణ్యమైన తాజా కూరగాయలను అందించాలనే ఉద్దేశంతో ఎలమంచిలిలో నిర్మించిన రైతు బజారు సుమారు పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం రైతు బజారు ప్రాంగణం పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉంది. ప్రజాప్రతి నిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న రైతు బజారు ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) మూసి ఉన్న రైతు బజారు

ఎలమంచిలిలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన 2011లో రైతు బజారును ప్రారంభిం చారు. మొదట్లో వినియోగదారులతో బజారు కళకళలాడుతుండేది. క్రమేణా దాని నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో కళ తప్పింది. ఆదరణ లేదన్న సాకుతో సుమారు పదేళ్ల క్రితం రైతు బజారును మూసి వేశారు. దీంతో వినియోగదారులకు తాజా కూరగాయలు దొరక్కపోగా, బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కొనుక్కోవలసి వస్తోంది. రైతు బజారు లేకపోవడంతో రైతులకు కూడా దళారుల బెడద తప్పడం లేదు. అలాగే లక్షలాది రూపాయలతో నిర్మించిన రైతు బజారు ప్రస్తుతం ఘోరంగా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతు బజారును పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

మహిళల సాధికారతకు బ్రాండిక్స్ చేయూత

కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ప్రశంసలు

- టారిఫ్‌ల వల్ల వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ

- వార్త మెయిన్‌లో..



బ్రాండిక్స్ అపెరల్ సిటీలో పర్యటిస్తున్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, ఎంపీ సీఎం రమేశ్, మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸▸ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు



సన్యాసమ్మ చెరువు పార్క్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్, తదితరులు

ఎలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మునిసిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మెగా క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. మునిసిపాలిటీలోని సన్యాసమ్మ చెరువు పార్కు వద్ద అధికారులంతా కలిసి చెత్తాచెదారాన్ని తొలగించారు. బయ్యవరం పంచాయతీలో ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు కలిసి పరిసరాల శుభ్రత చేపట్టారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల మరుగుదొడ్లను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు దేవి, బొడ్డేడ సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

'గృహ నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట'

మునగపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు డైరెక్టర్ బీలా స్రవంతి పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో శనివారం పీఎంజీవై గృహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థలం లేని వారికి స్థలం, స్థలం ఉండి నిర్మాణం చేసుకోలేని వారికి ఆర్థిక సహాయంతో సొంతింటి కల నెరవేరుస్తుందని చెప్పారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో బీలా గంగాభవానీ సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందజేయనున్నాయని సమాచారం. ఈ కార్యక్రమంలో బీలా లక్ష్మణరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బోర్డు డైరెక్టర్ బీలా స్రవంతి

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి : ఎస్ఐ

ఎలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులంతా పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితమైన ప్రయాణం సాగించాలని ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని ఓ పెట్రోలు బంకు సమీపంలో వాహనదారులకు ఏర్పాటైన అవగహన సదస్సులో మాట్లాడారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు. నిబంధనలు పాటించనివారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



ట్రాఫిక్‌పై సూచనలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వణుకు పుట్టిస్తున్న వంతెన!

▸▸ 26 ఏళ్ల క్రితం మర్రిపాలెం- రాజారాయుడుపాలెం మధ్య మైనర్ శారదాపై నిర్మాణం

▸▸ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు రక్షణ గోడలు కరువు

▸▸ దాటి వెళ్లాలంటే రెండు గ్రామాల ప్రజలు ఆందోళన

రాంబిల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిపాలెం నుంచి రాజారాయుడుపాలెం వెళ్లే రోడ్డులో గల మైనర్ శారదాపై ఉన్న వంతెన భయపెడుతోంది. పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం పొంది ఉంది. ఈ వంతెనను 1999లో పై రెండు గ్రామాల మధ్యలో ఉన్న మైనర్ శారదా నదిపై నిర్మించారు. ప్రస్తుతం దీని పరిస్థితి దారుణం ఉండడంతో దీనిపై వెళ్లే సమయాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉన్నప్పుడు, రాత్రి సమయాల్లో వంతెన దాటేటప్పుడు మరింతగా భయంగా ఉందని అంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని దీర్ఘకాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని మర్రిపాలెం, రాజారాయుడుపాలెం గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



మైనర్ శారదా నదిపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు లేని దృశ్యం

సంప్రదాయబద్ధంగా శ్రీరామలింగేశ్వర కల్యాణోత్సవ రాట

మునగపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిపల్లి గ్రామంలో గల రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో వార్షిక కళ్యాణ ఉత్సవ రాటోత్సవాన్ని శనివారం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈనెల 17వ తేదీన స్వామి వారికి వార్షిక కళ్యాణం నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు శనివారం ఉత్సవ రాటను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన స్వామి వారి కళ్యాణం జరుగుతుందని, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలు, సారె ఊరేగింపు వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



ఆలయం ఆవరణలో ముహూర్తపు రాట వేస్తున్న కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

మూలపేటలో 'ఉపాధి' పనులపై తీర్మానం

మునగపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధి హామీ పథకం పనులకు గ్రామసభ ఆమోదం తెలిపినట్టు సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు తెలిపారు. మండలంలో మూలపేట గ్రామంలో శనివారం గ్రామసభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో కూడా గ్రామంలో ఉపాధి పనులు పెద్ద ఎత్తున జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఉపాధి కార్మికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టి.సిరసపల్లి బీసీ కాలనీలో మురుగు సమస్య



రోడ్డుపైకి చేరిన మురుగు

మునగపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టి.సిరసపల్లి బీసీ కాలనీ ప్రధాన రోడ్డు మార్గంలో మురుగు తిష్ఠ వేస్తోంది. ఇక్కడ డ్రైనేజీ లేకపోవడం ఇళ్లలోని వాడుక నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో రాకపోకలకు అంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసేటప్పుడు ఇక్కడ మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. మురుగుతో పాటు వర్షపు నీరు నిలిచిపోతోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఇక్కడి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

రైతులకు తక్కువ రేట్లకే వ్యవసాయ పరికరాలు

▸▸ వెలుగు ఏపీఎం శ్రీనివాస రావు

అచ్యుతాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మార్కెట్ ధరల కంటే తక్కువకే వ్యవసాయ పనిముట్లు ఇస్తామని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాస రావు తెలిపారు. రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యలో ఇక్కడి వెలుగు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎక్కువగా వరి, బెల్లం, చేపలు, డ్రైఫిష్ ఉప ఉత్పత్తులు, కూరగాయలు, కిచెన్ గార్డెన్ వంటి కార్యక్రమాలు అమలు చేసే అవకాశం ఎక్కువగా ఉన్నందున భవిష్యత్తులో వీటిని మహిళలచే అమలు చేయిస్తామన్నారు. నెలకు రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ గురించి కూడా వివరిస్తామని చెప్పారు. ఆన్‌లైన్ వ్యాపారం చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌పీఓ సీసీ కె. పద్మావతి, సీసీలు రాజా రమేష్, నాగ రాజు, సరోజిని, రాంబాబు, దేముడు, భవానీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసరావు

'గ్రంథాలయాల సందర్శనతో జ్ఞాన సముపార్జన'

ఎలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని విశ్రాంత అధ్యాపకులు కె.గోపీకృష్ణ, ఆడారి పూరి జగన్నాథం అన్నారు. పట్టణంలోని శాఖాగ్రంథాలయ ఆవరణలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. గ్రంథాలయాధికారి వి.ఆనంద్, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయాధికారి రమణ వివిధ పుస్తకాలను పరిచయం చేశారు. వాటిని విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశారు. పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఉపాధ్యాయులు బంగార్రాజు, నరేంద్ర, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : గ్రంథాలయాలు తరగని విజ్ఞాన గనులని దిమిలి కార్యదర్శి అమ్మాజీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సందర్శిస్తుండాలన్నారు. గ్రంథాలయం అధికారిణి శకుంతల, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న ఆలయంలో ఏకాదశి పూజలు

నక్కపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రం కార్తీకమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం, పూజలు చేశారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉమ్మడి జిల్లాలోని వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. క్యూ లైన్లలో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి విహారయాత్ర కోసం ఉపమాక ఆలయానికి వచ్చిన పిల్లలకు క్షేత్ర మహత్యం గురించి ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు వివరించారు. హెటిరో సంస్థ ఛైర్మన్ పార్థసారథిరెడ్డి సహా పలువురు స్వామిని దర్శించుకున్నారు.



స్వామివారు

సృజనాత్మకతతోనే రాణింపు

▸▸ ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ పీఎంవీ సుబ్బారావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్బారావు

పాయకరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత దృక్పథం, తెలుసుకోవాలనే ఉత్సుకత, నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే ఉన్నతంగా ఎదగడానికి వీలవుతుందని ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ పీఎంవీ సుబ్బారావు అన్నారు. శనివారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులనుంచి అయన మాట్లాడుతూ, చదువుకునే వయస్సులోనే విశ్లేషణాత్మక దృష్టి కలిగి ఉండాలన్నారు. ఆసక్తితోనే కొత్త ఆవిష్కరణలు సాధ్య మవుతాయన్నారు. విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సొసైటీ అధ్యక్షులుడాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజయ్యపేటకు రానున్న నాఫ్ సెంట్రల్ కమిటీ

పాయకరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన దీక్షలు చేస్తున్న మత్స్యకారులను కలిసి సమస్యలు తెలుసుకునేందుకు జాతీయ మత్స్యకార సంఘం సెంట్రల్ కమిటీ త్వరలో రాజయ్యపేటకు రానుందని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు తెలిపారు. విశాఖలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సుకు వచ్చిన నాఫ్ వర్కింగ్ ఛైర్మన్ ఎస్. ప్రభాకరన్‌ని శనివారం కలిసి వినతి ప్రతం అందజేశామన్నారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో నాఫ్ ఛైర్మన్ నందకుమార్ ఆధ్వర్యంలో రాజయ్యపేట మత్స్యకారులను కలుస్తారని అప్పలరాజు తెలిపారు.



నాఫ్ వర్కింగ్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు

అలరించిన పుస్తక ప్రదర్శన

నక్కపల్లి: .మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి. బాలాజీ , విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను హెచ్ఎం బాలాజీ వివరించారు.

నక్కపల్లి సంతకు మహర్దశ

▸▸ హోం మంత్రి అనిత చొరవతో

షాపుల నిర్మాణానికి శంకుస్థాపన

నక్కపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతకు రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గుర్తింపు ఉంది. ఈ సంతలో శాశ్వత షెడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ప్రతీ శుక్రవారం జరిగే ఈ సంతలో ఎండుచేపల వ్యాపారం, ఎగుమతులు భారీ స్థాయిలో జరుగుతుంటాయి. వీటితోపాటు కూరగాయలు, పలు రకాల సరకులను విక్రయిస్తూ అనేక కుటుంబాలకు చెందిన వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. ఈ ఏడాదిలో జరిగిన అగ్ని ప్రమాదంలో వ్యాపారులకు చెందిన సంతలోపలు పాకలు దగ్ధమయ్యాయి. హోం మంత్రి అనితను వ్యాపారులు కలిసి, తమకు షెడ్లు నిర్మించి ఆదుకోవాలని కోరారు. ఈమేరకు హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు. ఆమె సూచనల మేరకు రూ. 50 లక్షలతో వారపుసంతలో 60 షాపుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఇందుకయ్యే ఖర్చును హెటిరో, డెక్కన్ పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులను కేటాయిస్తున్నాయి. వైస్ ఎంపీపీ (వైసీపీ నేత) వీసం నానాజీ, టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, ఉపమాక దేవస్థానం మాజీ ఛైర్మన్ కొండబాబు, నక్కపల్లి సొసైటీ ఛైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, దేవవరపు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



షాపుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నాయకులు

న్యాయ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది నూకరాజు

ఎస్.రాయవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి కోర్టు ప్యానెల్ న్యాయవాది టి. నూకరాజు శనివారం మండలం అడ్డరోడ్డు తిమ్మాపురం విశ్వశాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచి చట్టాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం ఆయన జీడి పప్పు ఫ్యాక్టరీని సందర్శించారు. యాజమాన్యం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలనుకార్మికులను అడిగి తెలుసుకున్నారు. చట్టాల పై అవగాహన కల్పించారు. ఆయన వెంట యలమంచిలి కోర్టు పారా లీగల్ వలంటీర్లు చిరంజీవి, ప్రసాద్, కుమారి, రాజేశ్, సీహెచ్.రాజు, శివ,లక్ష్మిరత్నం,ఆర్ఐ,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ: ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీఈవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఎస్.నర్సాపురం, కందిపూడి, ఈదటం, పాల్తేరు, తదితర గ్రామాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈదటం గ్రామంలో సంపద తయారీ కేంద్రం షెడ్డు నిర్మించి తొట్టెలు నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేయడంపై కార్యదర్శి, ఉపాధి సిబ్బంది, సర్పంచ్‌తో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కందిపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం త్వరలో వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు.

వినాయక, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠ

ఎస్.రాయవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రేవుపోలవరంలో ని షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శనివారం కొత్తగా సిద్ధి వినాయక, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఆలయాల్లో అర్చకుడు సాయిరాం విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఈ విగ్రహాల ప్రతిష్ఠించారు. ఈ ఆలయాలను దాతలు గుడివాడకు చెందిన మందపాటి సత్యనారాయణరాజు, రమాదేవి దంపతులతోపాటు భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



దత్తాత్రేయ ఆలయం

పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీధర్‌కు పదోన్నతి

పాయకరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖ పాయకరావుపేట డివిజన్ ఏడీ వి.శ్రీధర్ డీడీగా పదోన్నతి పొందారు. శనివారం అమరావతిలోని కమిషనర్ కార్యాలయం నుంచి ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాకినాడ జిల్లా తునిలో పశుసంవర్ధకశాఖ ఏడీగా ఆరేళ్లు పనిచేసిన ఆయన, గత నాలుగు నెలల క్రితం పాయకరావుపేటకు బదిలీపై వచ్చారు.



ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు

కోటవురట్ల, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బీకే పల్లి గ్రామంలో 15 ఇంకుడు గుంతలు మంజూరైనట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు పెంపునకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పెట్ల లింగంనాయుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి రఘురామ్, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బీకేపల్లిలో ఇంకుడు గుంతలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో

విద్యార్థులకు వివిధ పోటీలు

పాయకరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక వైఎస్ఆర్. శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో 6,7 తరగతుల విద్యార్థులకు, శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఆధ్వర్యంలో సీనియర్స్ విభాగంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావుతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛంధ్ర- స్వర్ణాంధ్ర' ర్యాలీలు

పాయకరావుపేట రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం, శ్రీరాంపురం, మాసాహెబ్‌పేట, పెంటకోట, గోపాలపట్నం, పెదరాంభద్రపురం, పాల్మన్‌పేట, వెంకటనగరం, మంగవరం, గుంటపల్లి తదితర గ్రామాలలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వై.వి.సత్యనారాయణ, నాయుడు, దుర్గాప్రసాద్, రామగోవిందు, కొండారావు, మురళి, సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, అంగన్వాడీలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

పాయకరావుపేట: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్‌తోపాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పట్టణంలోని చెక్కానగర్‌లో తుప్పలు తొలగించి, కాలువలు శుభ్రం చేశారు. అదేవిధంగా పలు చోట్ల మొక్కలు నాటారు. ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని స్థానిక పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మండలంలోని ఉపమాక ప్రాథమిక పాఠశాలలో సెక్రటరీ జయ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో బి. చైతన్య, సొసైటీ ఛైర్ పర్సన్ బుజ్జి పాల్గొన్నారు. సర్పంచ్ ప్రగడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న నక్కపల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ బుజ్జి



చెక్కానగర్‌లో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

ఎస్. రాయవరం: ఎస్. రాయవరం, సైతారుపేట గ్రామాల్లో ఎంపీ డీవో మీనాకుమారి పాల్గొని మొక్కలు నాటారు. రామయ్యపట్నం, చినగుమ్ములూరు, పెట్టుగోళ్ళపల్లి గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు.స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలం బీకేపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా మ్యాజిక్ డ్రైనేజీ నిర్మించారు. వాటిని ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో చిన్నారావు పరిశీలించారు. ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు స్థానిక జడ్పీ బాలికల ఉన్నతపాఠశాల, చౌడువాడ యూపీ స్కూల్‌లో మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

నేత్రపర్వంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం మళ్ల వీధిలోని గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవానికి 83వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెయిన్ రోడ్డు మీదుగా అమ్మవారి వాహనాన్ని ఊరేగించి శారదా నదిలో అనుపు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొలిమేర ఆనంద్‌కుమార్, ఎస్.భానుచందర్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చదరం నూకయ్యగారి వీధిలోని గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. ఆరు గంటల తరువాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పురవీధుల్లో ఊరేగించి అనుపు చేపట్టారు. అదేవిధంగా స్థానిక లక్ష్మీదేవిపేటలోని గౌరీపరమేశ్వరుల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉద యం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులు కూడా అధికసంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. రాత్రికి పురవీధుల గుండా ఊరేగించారు. పలువురు భక్తులు మొక్కుబడుల్లో భాగంగా శూలాలు ధరించారు.



ఆళ్లవారి గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

కశింకోట : మండల కేంద్రం కశింకోటలోని పూసర్లవీధిలో ఉన్న కూనిశెట్టి వారి గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్



ఆది దంపతులను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పీలా



ఆళ్లవారి గౌరీ పరమేశ్వరులు

కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఉత్సవమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కశింకోట పీఏసీఎస్ చైర్మన్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, తాకాశి కృష్ణ, వార్డు మెంబర్ జగన్నాథం, రెడ్డి త్రినాథ్, సాయి, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జలగలమదుం బ్రిడ్జికి వాజపేయి పేరు పెట్టాలి



డీఆర్‌వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి శివారు జలగలమదుం కూడలిలో ఉన్న సర్కిల్ వద్ద అటల్ బిహారీ వాజపేయి విగ్రహం ఏర్పాటు చేసి, అటల్ ఫ్లైవోవర్ అని బ్రిడ్జికి నామకరణం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం డీఆర్‌వో సత్యనారాయణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రహదారుల అభివృద్ధితో పాటు దేశాభివృద్ధిలో వాజపేయి సేవలకు గుర్తుగా పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామునాయుడు, సంతోషిమాత దేవాలయం చైర్మన్ మారిశెట్టి భాస్కర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ప్రయాణం చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. కశింకోట కూడలి వద్ద, బయ్యవరం కూడలి వద్ద శనివారం ఆయన హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తున్న వాహనదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు ఎంతో మేలు జరుగుతుందన్నారు. హెల్మెట్ లేనివారికి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానా విధించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

షుగర్ వ్యాధి నివారణకు యోగాసనాలు



షుగర్ వ్యాధి నివారణకు యోగాసనాలు చేయిస్తున్న దృశ్యం

కొత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : షుగర్ వ్యాధి నివారణకు అనకాపల్లి జార్జి క్లబ్‌లో యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ప్రారంభమై ఈ నెల 18 వరకు కొనసాగనుంది. ఇందులో భగంగా పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మంగయ్య షుగర్ వ్యాధి తగ్గడానికి అవసరమైన ఆసనాలను వేయించారు. అంతేకాకుండా పలు కషాయాలు, జ్యూస్‌లు అందజేశారు. పతంజలి యోగా జిల్లా సభ్యులు కోలపర్తి కన్నబాబు, కొణతాల సుబ్రహ్మణ్యం, భీమరశెట్టి శ్రీనివాస్, ఆళ్ల సూర్య రామకృష్ణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



నెమలి పింఛాలతో స్వామిని అలంకరించిన దృశ్యం

లంకెలపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం మారుతి కూడలిలో కొలువై ఉన్న అభయాంజనేయ ఆలయం 12వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు స్వామివారిని నెమలి పింఛములతో అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించకొని పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నమారాధనను ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారిని సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మాదాసు శ్రీనివాసరావు, పచ్చికోరు రమణమూర్తి, మడక రమేశ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు



బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రతి రోజూ ఇక్కడి నుంచి వందలాది మంది విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు విశాఖ, గాజువాక, ఎన్ఏడీకి వెళ్లి వస్తుంటారు. బస్సులు వచ్చేంత వరకు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోకి, దుకాణాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

పరిశుభ్రతపై ప్రతిన

- విద్యాలయాలు, ఆర్టీసీ డిపో ఆవరణలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర
- చీపుర్లు చేతబట్టి ఆయా ఆవరణలను తీర్చిదిద్దిన అధికారులు



గాంధీనగరం జీవీఎంసీ స్కూల్‌ను శుభ్రం చేస్తున్న జడ్సీ, ఉపాధ్యాయులు



ఆర్టీసీ డిపో ఆవరణను శుభ్రం చేస్తున్న డీఎం, ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాల, ఆ పరిధిలోని జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తదితరులు శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిశుభ్రత లేని కారణంగా కలిగే నష్టాలు, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన వల్ల తలెత్తే పరిస్థితులను తెలియజేశారు. అలాగే చెత్తను తడి, పొడిగా వేర్వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, జీవీఎంసీ జోన్ అధికారులు, శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్రాపై అందరూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం హనుమశ్రీ ఆధ్వర్యంలో ఉద్యోగులు పరిశుభ్రత పనులు చేపట్టారు. చీపుర్లు చేతపట్టి డిపో ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో పరిశుభ్రత మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. ప్రయాణికులే సంస్థకు ప్రధానమని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఐఈవో

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్ర స్థాయి బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పోటీలో తలపడ్డారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలికల విభాగం నుంచి విశాఖ జిల్లా జట్టు చాంపియన్‌షిప్ ట్రోఫీని సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. కడప, తూర్పుగోదావరి జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా చిత్తూరు, నెల్లూరు జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులందరినీ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఏ పుష్పలత తెలిపారు. ఇదిలావుంటే, విజేతలకు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో) ఎం.వినోద్‌బాబు చేతుల మీదుగా చాంపియన్‌షిప్ ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, కళాశాలల సమన్వయకర్త జి.గ్రేసు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమా, స్కూల్ గేమ్స్ ఫెడరేన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావుతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మానసిక రోగులను విశాఖ మానసిక వైద్యశాలకు తరలిస్తున్న పోలీసులు

నలుగురు మానసిక రోగులు ఆస్పత్రికి తరలింపు

కొత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలో రోడ్లపై సంచరిస్తున్న నలుగురు మానసిక రోగులను విశాఖపట్నం మానసిక వైద్య శాలలో చేర్పించేందుకు శనివారం తరలించామని పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్, ఎస్ఐ కె.సంతోష్‌కుమార్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మురళీ, మనోబంధు ఫౌండేషన్ సభ్యులు ఎల్.బాలసురేష్‌ల సహాయంతో మతిస్థిమితం లేకుండా, అనారోగ్యంతో ఉన్న నలుగురిని చేరదీసి వారికి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్లపై మానసిక రోగులు సంచరించినట్లైతే పట్టణ సీఐ 9490737758, రెడ్‌క్రాస్ సొసైటీ మురళీ 6300494020, మనోబంధు సొసైటీ బాల సురేష్ 9391550659 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

శత చండీయాగానికి రాట మహోత్సవం



ముహూర్తపు రాట వేస్తున్న కమిటీ సభ్యులు, పెద్దలు

కొత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు రేజేటి చక్రవర్తి ఆధ్వర్యంలో శత చండీయాగం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం ఇక్కడ రాట వేశారు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 8 వరకు యాగం రాట మహోత్సవం పనులకు రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజు, మంగారపు సూరిబాబు, ఆకుల వెంకటఅప్పారావు, చలమాజీ, ప్రసాద్, లక్ష్మి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన



తాళ్లపాలెం జడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి

కశింకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పదో తరగతి పరీక్షలకు కేటాయించిన పలు కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీధర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ విజయరామ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కేం ద్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో డెస్కులు, విద్యుత్, నీటి సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీటి వసతి తదితర సౌకర్యాలపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను ఆరా తీశారు. ఈ విధంగా తాళ్లపాలెం జడ్పీ హైస్కూలు, నర్సింగబిల్లి, జి.భీమవరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం తదితర పాఠశాలలను నేరుగా సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో పి.వి.సురేష్ తదితరులున్నారు.

గ్రంథాలయాల్లో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో ఎంఈవో లక్ష్మణరావు, విద్యార్థినులు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పలుచోట్ల పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచే దేవాలయాలని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ అనకాపల్లిలో గ్రేడు-1 శాఖా గ్రంథాలయం అందరికీ అందుబాటులో ఉండడం ఆనంద దాయకమన్నారు. విద్యార్థులు, యువత ఖాళీ సమయాల్లో సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలన్నారు.

పరవాడ : మంచి పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాభివృద్ధి పెంపొందించుకోవచ్చని స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి కె.రామారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పరవాడ శాఖా గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన లో మాట్లాడారు. ప్రతి రోజు పుస్తకాలను పఠించడం ద్వారా కొత్త కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు పుస్తక పఠనం చాలా ఉపయోగ పడుతుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులు, పెద్దలకు ఉపయోగపడే పలు పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కె.వి.లక్ష్మణరావు, పాఠకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నబ్బవరం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథా లయంలో శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రంథాలయాధికారిణి శిరీషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 లక్ష్మణరావు వివిధ పాఠశాలల నుంచి వచ్చినటి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తరచుగా గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరపరసాద్, విజయ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు వాహన చోదకులపై కేసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వాహనదారులకు జరిమానా విధిస్తున్న సీఐ

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాం తాల్లో అనధికారికంగా ప్రభుత్వ స్థలాల్లో పార్కింగ్ చేస్తున్న వాహనాలపై సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ శేఖరం శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 'అడ్డదిడ్డంగా పార్కింగ్' శీర్షిక పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలో అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాల పై కేసులు నమోదు చేశారు. మొత్తం 31 వాహనాలపై రూ. 20,085లు జరిమానా విధించినట్టు తెలిపారు.

పరవాడ పంచాయతీకి 'ఫైజర్' సోలార్ లైట్ల వితరణ

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫైజర్ పరిశ్రమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పరవాడ పంచాయతీకి రూ.80 వేలు విలువ చేసే సోలార్ లైట్లను సమకూర్చినట్లు సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు తెలిపారు. గ్రామంలో ప్రజలకు రాత్రి సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు గుర్తించి, చీకటి ప్రాంతాల్లో భద్రతను మెరుగుపరిచేందుకు వీలుగా ఈ లైట్లను అందజేసినట్టు చెప్పారు. త్వరలోనే లైట్లను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

నబ్బవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరిపాక సమీపం చెరుకు కాటా వద్ద గల షిర్డీసాయి ఆలయం 15వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ నాయకులు గండి రవికుమార్ స్వామివారిని దర్శించుకొని అనంతరం జిల్లాస్థాయి మహిళా కోలాటం పోటీలను ప్రారం భించారు. ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ కుమారుడు వంశీదీప్, ఆడారి నాగరాజు, రమేశ్‌రాజు మధ్యాహ్నం అన్న గంటలకు సమారాధన ప్రారంభిం చారు. సాయంత్రం దీపోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా బీజేపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, వైసీపీ నాయకులు కోటాన రాము, బోకం రాము నాయుడు, కర్రిబాబు, సురేష్‌రాజు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు గ్లోబల్ స్కూల్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వారణాసిలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి విలువిద్య టీలకు మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో పాఠశాలకు చెందిన వేమూరి ఆద్య, గేదెల జానేష్ అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధుబాబు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో కె. నిశాంత్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అఖండ దీపారాధన



సాంబశివ ఆలయంలో అఖండ దీపారాధన

అనకాపల్లి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చినరాజుపేటలో ఉన్న చౌడేశ్వరి సాంబశివ ఆలయం వద్ద కార్తీకమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో అఖండ దీపారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ దేవతా మూర్తుల విగ్రహాల వద్ద దీపారాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు ఆకర్షణలుగా నిలిచాయి.


బిర్సా ముండా వి గ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ రాహుల్ పురాణా, తదితరులు


సీలేరులో..


పాడేరులో సీపీఎం నాయకులు నివాళి

ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు బిర్సాముండా

» మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎ ఫైర్స్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రాహుల్ పురానా, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ

పాడేరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకార్థం జాతీయ గౌరవ దివాస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రాహుల్ పురానా, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ అన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్నవిగ్రహానికి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనగా ఐటీడీఏ సమావేశ మందిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాల ప్రత్యేక అభివృద్ధి కోసం ప్రతీ గ్రామంలో ధర్తీ అభాజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గిరిజనులు ఉద్యోగాలు చేస్తూ దేశం నలుమూలలా వారు ఉనికిని తెలియజేయడమేకాకుండా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద నృత్యం చైర్మన్ వి.గంగులయ్య, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజారావు, ఎంపీపీ ఎస్.రత్నాలమ్మ, ఐటీడీఏ ఏవో హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు. బిర్సాముండా జయంతిని ఏపీఎస్జీవో కార్యాలయ ప్రాంగణంలో సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథంమాట్లాడుతూ ఆదివాసీ మహిళలను గతంలో కించపరిచిన ఒడిశా ముఖ్యమంత్రికి బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు లేదని విమర్శించారు. పదేళ్లుగా కొనసాగుతున్న ఆంధ్రా-ఒడిశా సరిహద్దువివాదంపై పాడేరు వస్తున్న ఆయన స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిల్లో సు రేంద్ర, పి.అప్పలనర్స, సోమెలి చిట్టిబాబు, వి.ఉమామహేశ్వరరావు, డి. గంగరాజు, పోతురాజు, వి.వి. జయ, రామారావు, సుందరరావు పాల్గొన్నా రు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు జల్లి రాజుబాబు ఆధ్వర్యంలో బిర్సా ముండాకు నివాళులర్పించారు.నాయకులు అమర్, వి.కృష్ణ, ఎస్.జగదీస్, సంతోష్ పాల్గొన్నారు. ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో మోరీజాన్ ఆధ్వర్యంలో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ వి.జయరాజు, ఈఆర్‌పీలు సింహాచలం, సుబ్బారావు, మణికంఠ, బిందు, పాల్గొన్నారు.


కొయ్యూరులో బిర్సాముండా జయంతి వేడుకలు

చింతపల్లి: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా సేవలు చిరస్మరణీయమని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం, గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల, గిరిజన భవన్‌లో ఉపాధ్యాయులు బిర్సా ముండా చిత్రపటానికి నివాళి అర్పించారు. పీజీహెచ్‌ఎం బీఎస్ఎన్ రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషణం, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, పెసా కమిటీ కార్యదర్శి రామకృష్ణ, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం, బౌడు గంగరాజు, పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్థానిక ఎంపీపీ బోయిన కుమారి మండల పరిషత్ కార్యాలయంలో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీవో రమణబాబు, స ర్పంచ్ సుభద్ర, వైస్ ఎంపీపీ దేముడు, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక కిడారి సామాజిక భవన ప్రాంగణంలో అల్లూరి యూత్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్, సోవ్వా గ్రామంలో టీడీపీ యూనిట్ కన్వీనర్ కమల్ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో నాయకులు వవ సూర్య, రవిరాజు,అశోక్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

సీలేరు: సీలేరు సచివాలయంలో బిర్సాముండా జయంతి వేడుకల నునిర్వహించారు. సీలేరు కార్యదర్శి పరశురామ్ ఆధ్వర్యంలో సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి హాజరై బిర్సాముండా చిత్ర పటానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కూ టమి నాయకులు సీహెచ్ రాము, కె. అప్పలరాజు,బాలకృష్ణ, పెసా కమిటీ అధ్యక్షుడు మనోజ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిర్సాముండా చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్ ఏవో సిబ్బంది, కొయూరు, రాజేంద్రపాలెం గ్రామ కార్యదర్శిలు, సచివాలయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జీకే వీధిలో..

రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రో పోటీల్లో ఆశ్రమ విద్యార్థి ప్రతిభ


గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవినుంచి జ్ఞాపికను అందుకుంటున్న విద్యార్థి రజని

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జావెలిన్‌త్రో పోటీల్లో లోతుగెడ్డ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఎం. రజని ప్రథమ బహుమతి సాధించాడు. ఈ మేరకు శనివారం అమరావతిలో జరిగిన బిర్సా ముండా 150 జయంతి ఉత్సవాల్లో రజనికి గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేశారు. రజని మండల, డివిజన్, జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 10 నుంచి 12 వరకు గీతం విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం సాధించాడు. ఈమేరకు విద్యార్థిని గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ అభినందిస్తూ బహుమతిని అందజేశారు. రజని, పీడీ బి. లింగరాజుని ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ రమణ, డిప్యూటీ వార్డెన్ చల్లంగి సత్యనారాయణ అభినందించారు.

మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

పెదబయలు, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో అన్ని ఏవీహెచ్ పరిధిలో మూగ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు పెదబయలు పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాతి కిశోర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొరవంగి పంచాయతీ పరిధిలో గల మూగ జీవాలకు డాక్టర్ విజయ్‌పాణిగ్రహి ఆధ్వర్యంలో 268 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వివిధ వ్యాధుల బారినపడకుండా ముందు జాగ్రత్తగా మందులు ఉచితంగా పంపిణీ చేసినట్టు చెప్పారు. పశువుల పరిరక్షణకు గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పశువులకు అనారోగ్య సమస్యలు వచ్చినా తమ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు రామునాయుడు, అప్పలరాజు, గణేష్‌కుమార్, ఓఎస్ శివరాజు, పర్పంచ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

‘కూటమి పాలనలోనే అభివృద్ధి’

పెదబయలు, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కిముడుపల్లి సర్పంచ్ కె.శోభరాణి తెలిపారు. శనివారం 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయితీ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వనబరంగి గ్రామంలో సుమారు రూ. 3 లక్షలతో 70 మీటర్ల సీసీ రోడ్డు, వంతర్బ గ్రామంలో రచ్చబండ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మర్రి మత్యారాజు, వార్డు సభ్యులు దానన్న,కృష్ణారావు,అప్పలకొండ, నాయకులు బాబూరావు,తమన్న, విశ్వనాథం, త్రినాథ్,బాబీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు పాడేరు ఘాట్‌లో భారీ వాహన రాకపోకలు నిషేధం

పాడేరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి ఆదివారం పర్యటన నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 16వ తేదీ ఆదివారం సాయంత్రం 6 వరకు పాడేరు ఘాట్‌లో భారీ వాహన రాకపోకలను నిషేధించినట్టు ఎస్పీ అమిత్ బర్ధార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మండలంలోని చింతలవీధిలో బిర్సా ముండా విగ్రహావిష్కరణ అనంతరం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బహిరంగ సభలో ఒడిశా సీఎం పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యం ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిషేధించినట్టు ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


అరకులోయ డిగ్రీకళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, అధ్యాపకులు

అరకులోయ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు వారి పుట్టిన రోజున పదిమొక్కల చొప్పున నాటాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్‌నాయక్ అన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్ -2 పీవో విజయలక్ష్మీ పుట్టినరోజు కావడంతో ఆమె కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులతో మొక్కలు (అరౌకాలియా) మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ పీవోను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు మొక్కలు నాటి వాటిని పరిరక్షించేలా బాధ్యత వహించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కొండబాబు మాట్లాడుతూ గ్రామాల్లో సైతం వలంటీర్లు పర్యావరణ ప రిరక్షణపై అవగాహన కల్పిస్తూ శుభకార్యాల్లో మొక్కలు నాటడం సంప్రదాయంగా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో అనితకుమారి, అధ్యాపకులు లచ్చన్న, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

» ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్


కొత్తూరు కేజీబీవీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, తదితరులు

అనంతగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు కేజీబీవీ, శివలింగపురం పరీక్ష పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, ఎంఈవో బీటీ నాగేశ్వర రావు సందర్శించారు. ముందుగా పరీక్ష కేంద్రాలు వద్ద సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పరీక్షల సమయంలోని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కృషిచేస్తున్నామని, నిర్వహణలోని లోపాలు లేకుండా ఉండాలని తనిఖీలు నిర్వహిస్తున్నామని, పరీక్షలను పగడ్బందిగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈకార్యక్రమంలోని శివలింగపురం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కొండబాబు, కేజీబీవీ ఎస్‌వో సుశీల, ఎమార్పీ సిబ్బంది అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» సీఆర్ మీడియా చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు వాస్తవాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సీఆర్ మీడియా అకాడమీ ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ తరగతులను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంత విలేకరుల వృత్తినైపుణ్యం మెరుగు పర్చుకునేందుకు ప్రెస్ అకాడమీ ద్వారా శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తోందన్నారు. రెండు రోజుల పాటు అనుభవజ్ఞులైన జర్నలిజం ప్రొఫెసర్లు పలు అంశాలను బోధిస్తారన్నారు. గిరిజన ప్రాంతంలో విలేకరులు ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే, నిత్య విద్యార్థిగా పాత్రికేయులు ముందుకు సాగాలన్నారు. వార్తలు ఏ విధంగా రాయాలి? ఎటువంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి? పరిశోధనాత్మక కథనాలు ఎలా రాయాలో తెలుసుకోవాల్సిన బాధ్యత గ్రామీణ విలేకరులపై ఉన్నదన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య విలేకరులు వారధిగా పనిచేయాలన్నారు. అనంతరం పరిశోధనాత్మక జర్నలిజంపై సంపాదకులు వీవీ రమణమూర్తి, క్రైమ్ వార్తల్లో మెలకువలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్ట్‌మెంట్ హెడ్ బాబివర్ధన్, జర్నలిజంలో నైతిక విలువలపై సీనియర్ జర్నలిస్టు డి. సోమసుందర్ బోధించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌బీఎల్ స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. నాగరాజు, చింతపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు వీజే దయానంద్, ప్రింట్‌మీడియా అధ్యక్షులు దేశెట్టి సతీశ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎస్. వనరాజు, ఏపీఈఎంజేఏ రాష్ట్ర కార్యదర్శి చింతల కిశోర్, ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, తహశీల్దార్ ఎస్. శంకరరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేశ్ కుమార్, అధికారులు

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కొయ్యూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేట పంచాయతీ పరిధి మర్రిపాలెంలో పంచాయతీ నిధులతో సీసీ డ్రైనేజీ పనులకు శనివారం సర్పంచ్ వెంకట లక్ష్మి, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి శంకుస్థాపన చేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారి రవీంద్ర, వైస్ సర్పంచ్ బుక్క చంటి, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు రాజబాబు, శ్రీరాములు,చలపతిరావు,దేవి తదితరులు పాలొన్నారు.


మర్రిపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి సర్పంచ్ వెంకటలక్ష్మి,

విద్యార్థులకు పరామర్శ

గూడెంకొత్తవీధి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అజీర్తితో అస్వస్థతకు గురైన జర్రెల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్ శనివారం పరామర్శించారు.విద్యార్థులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొయ్యం బాలరాజు, నాయకుడు సుర్ల వీరేంద్ర, నాయకులు చిక్కుడు అశోక్, వనపల ఈశ్వర్ పాల్గొన్నారు.

‘స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర’ లక్ష్యం

పాడేరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, సమాజ పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద్రాపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, అధ్యాపకులు పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ జిల్లానోడల్ ఆఫీసర్ జి. గౌరీశంకరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.జానకీరామ్, డి.సునీత పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యానికి దోహదపడుతుందని స్థానిక ఎంపీపీ ఈశ్వరీ. జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ ఆధ్వ ర్యంలో ర్యాలీని ప్రతిజ్ఞను చేపట్టారు. అనంతరం బాలికల పాఠశాలల చేతులు శుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సుందరరావు, గెన్ను పాల్గొన్నారు.


పాడేరులో డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్


డుంబ్రిగుడలో చిన్నారులకు చేతుల శుభ్రం చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

సీలేరు: సీలేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యదర్శి పరశురామ్, సర్పంచ్ పి దుర్గో, మహిళా పోలీస్ రేవతి, కూటమి నాయకులు రాము, పెసా కమిటీ అధ్యక్షుడు మనోజ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: వ్యక్తిగత శు భ్రతతో వ్యాధులు దరి చేరవని స్థానిక ఎంపీడీవో ఎస్. డేవిడ్ రాజు పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సీడీపీవో బాలమణిదేవి, ఏటీడబ్ల్యూవో నాగశిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, సర్పంచ్ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలారంలో ఏకలవ్య పాఠశాల ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ రమేశ్‌బాబు, టీడీపీ నేత ఎంవీవీ ప్రసాద్

కొయ్యూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని బాలారంలో రూ. 32 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను శనివారం ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శిఎంవీవీ ప్రసాద్‌లు ప్రారంభించారు. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం నిధులతో ఈ పాఠశాల మంజూరైంది. ఈ పాఠశాలను బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని ప్రధాని వర్చువల్‌గా, స్థానిక సర్పంచ్ అప్పలనరస, కూటమి నాయకులు, ఎంపీపీ తదితరులు ప్రారంభించారు. మండలంలో అన్ని వసతులతో కూడిన ఆదర్శ గురుకుల పాఠశాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ మాజీ జడ్పీటీసీ శ్రీరామూర్తి, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గాడి సత్యవతి, సత్యనారాయణ, ఎంపీడీఓ జీడీవీ ప్రసాద్, తదితదితరులు పాల్గొన్నారు.

‘జామిగూడ పంచాయతీ నిధులు దుర్వినియోగం’

పెదబయలు, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జామిగూడ పంచాయతీలో అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసినా నిధులను స్థానిక సర్పంచ్ తెరవాడ అన్నమ్మ దు ర్వినియోగానికి పాల్పడ్డారని, దీని పై విచారణ చేపట్టాలని పంచాయితీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. పంచాయితీ పరిధిలోని 14 గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులు చేయకుండానే చేసినట్టు నకిలీ సంతకాలు సృష్టించి నిధులను స్వలాభానికి వినియోగించుకున్నారని ఆరోపించారు. 2021- నుంచి 2025 వరకు రూ. 40 లక్షలు పంచాయితీ అభివృద్ధి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని స్పష్టం చేశారు. కలెక్టర్. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పంచాయితీ నిధులు స్వాహా పై జిల్లా స్థాయి అధికారులతో సమగ్రమైన విచారణ చేపట్టి నిధులు రికవరీచేసి బా ధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు.


సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

విద్యాప్రమాణాలను మెరుగుపరచాలి: ఎమ్మెల్యే

అనంతగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట పంచాయతీలోని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శనివారం పర్యటించారు. ముందుగా భీమవరం పీహెచ్‌సీ తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. గురుకులం పాఠశాలను పరిశీలించారు. క్రీడా మైదానం, ప్రహరీ, ఉద్యోగులకు నివాస గృహాలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు ఈ సందర్భంగా వివరించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించేలా బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ పాగి అప్పారావు, వైసీపీ మండల అధ్యక్షుడు సూర్యానారయణ, తదితరులు పాల్గొన్నారు.


గుమ్మకోట గురుకులం పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

స్వచ్ఛందంగా జల్‌జీవన్ పథకానికి మరమ్మతులు

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుల వేనం నుంచి లంబసింగి గ్రామానికి జల్‌జీవన్ మిషన్(జేజేఎం) నిధులతో నిర్మించిన గ్రావిటీ పథకం మరమ్మతులకు గురైంది. తాగునీటి సమస్యపై గిరిజనులు పలుమార్లు పంచాయతీ అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. దీంతో శనివారం గ్రామ గిరిజనులు శ్రమదానం చేసి గ్రావిటీ పథకాన్ని మరమ్మతులు చేసుకున్నారు. సుమారు రెండు నెలలుగా అధికారులు స్పందించకపోవడంతో తామే తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నామని, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ఐటీడీపీ మండల ఇన్‌చార్జి వరకోటి మహేంద్రబాబు తెలిపారు.


గ్రావిటీ పథకం మరమ్మతు పనుల్లో లంబసింగి గిరిజనులు

వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలినట్టు పీజీహెచ్‌ఎం బీఎస్ఎన్ పడాల్ తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం. శ్రావణి, బి. చిన్నారి, జాయ్ ప్రియ ఇటీవల విశాఖలో జరిగిన పోటీల్లో పాడేరు ఐటీడీఏ వాలీబాల్ బృందం తరపునపాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. విద్యార్థినులు, పీడీ లోచలవరలక్ష్మిని హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం అభినందించారు.


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం

పాడేరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాడేరులో గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా ని ర్వహించారు. గత నెలరోజుల పాటు గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించా రు. అనంతరం శనివారం మధ్యా హ్నం ఆలయ ప్రాంగణంలో అన్న స మారాధన చేపట్టారు. సాయంత్రం గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను పట్టణం లో ఊరేగింపు నిర్వహించి మత్స్యగెడ్డలో నిమజ్జం చేశారు.సాంస్కృతిక కార్యకమాలు అలరించాయి.గౌరీ సేవా సంఘ నాయకులు, మహిళలుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఊరేగింపులో గౌరీ సంఘం ప్రతినిధులు

అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి పూజ

సీలేరు, నవంబరు 15 , (ఆంధ్రజ్యోతి): సీలేరు అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి అంబలం (పడిపూజ) ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభయ్యాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఆవాహిత పడిపూజ, పూలాభిషేకం నిర్వహించారు. బొబ్బిలికి చెందిన టీటీడీ అర్చకులు, గురుస్వామి కళ్యాణ స్వామి, ఆలయ అర్చకులు దామోదరస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పడి పూజకు సీలేరుతోపాటు, ఒడిశా చిత్రకొండ, మల్కన్‌గిరి, బలిమెల, డొంకరాయి, మోతుగూడెం, చింతపల్లి ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వాములు హాజరయ్యారు.


పూజల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

గంజాయి రవాణాలో ఎవరున్నా ఉపేక్షించకండి

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొంత మంది రాజకీయ నాయకులు గంజాయి నేరస్థులకు ఆశ్రయం కల్పిస్తున్నారని, ఈ విషయంలో ఎవర్నీ ఉపేక్షించవద్దని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సూచించారు. శనివారం మాదకద్రవ్యాలు, గంజాయిపై అవగాహన కోసం పోలీసులు నిర్వహిస్తున్న అభ్యుదయం సైకిల్ యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎవరైనా తమ పేరు చెప్పి వచ్చినా క్షమించకుండా జైలులో వేయాలని కోరారు. మాదక ద్రవ్యాలు, గంజాయి సమాజానికి అత్యంత హానికరంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే ప్రచారాన్ని నిర్వహిస్తున్నదన్నారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అబీద్ సెంటర్‌లో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.దేవప్రసాద్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, తహశీల్దార్ రామారావు పాల్గొన్నారు.

రోలుగుంటలో ర్యాలీ..

రోలుగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ప్రారంభించిన అభ్యుదయ ర్యాలీ రోలుగుంట మీదుగా భోగాపురం, కొత్తకోట వరకు సాగింది. అనంతరం మెయిన్ రోడ్డు కూడలిలో మానవహారం ఏర్పడి డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని నినాదాలు చేశారు. గంజాయిని పూర్తిగా అరికట్టేందుకు యువత, ప్రజలు ముందుకు రావాలని ఈ సందర్భంగా సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు కోరారు. గంజాయి రవాణా, సరఫరా జరిగినట్టు తెలిస్తే 112, 1972 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలకు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర



ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ దినేశ్‌కుమార్, ఈవో శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, సభ్యులు పప్పు శ్రీనివాసరావు, బొబ్బిలి ఈశ్వరరావు, బాలిబోయిన పార్వతి, సర్పంచ్ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యురాలు రూపాదేవి, వార్డు సభ్యులు నేమాల హరి, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, ఎర్రంశెట్టి చిన్న, గొర్లె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కౌన్సిలర్ పద్మావతి, అధికారులు

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అవసరమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చెప్పారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబీద్ సెంటర్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కట్టుబడి ఉండాలని కౌన్సిలర్ పద్మావతి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీడీపీవో రమణ, టౌన్ ప్లానింగ్ అధికారి హెచ్‌వీ.సత్యనారాయణ, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

వెంకన్న కొండపై గరుత్మంతుని విగ్రహావిష్కరణ



గరుత్మంతుని విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజు, నాయకులు

బుచ్చెయ్యపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకన్న కొండపై గరుత్మంతుని విగ్రహాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి గుడి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకర లక్ష్మి, నాయకులు దొండిన అప్పలనాయుడు, ముచ్చకర్ల తాతీలు, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, సుంకర శ్రీను, శనివాడ శ్రీను, పూడి రామారావు, అడ్డూరి శ్రీను పాల్గొన్నారు.

బంగారుమెట్ట శివాలయంలో వార్షిక కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు... పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారుమెట్ట శివాలయంలో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఆలయ పూజారి రవికృష్ణ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పుర వీధులలో ఊరేగించారు. వడ్డాది వెంకన్న ఆలయంలో ఏకాదశి పర్వదినం కావడంతో గిరిజాంబ గిరి కిక్కిరిసింది. అలాగే మండలంలోని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. రుద్రాభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

» శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు

» జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శ్రీదేవి

రావికమతం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న పదో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి కె.శ్రీదేవి తెలిపారు. రావికమతం బీసీ బాలికల వసతి గృహాన్ని శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, దోమతెరల వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. పదో తరగతి బాలికలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సందర్శించి పలు సూచనలు చేశారు. అలాగే విద్యార్థినులు పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యా బోధన అర్థమవుతుందా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందించామన్నారు. వెనుకబడిన వారిని గుర్తించి సమూహ చర్చల ద్వారా ముందుకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంగా తరచూ తనిఖీలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.





రావికమతం వసతిగృహంలో విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి... రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

రూ.6.6 కోట్లతో భవనాల పనులకు ప్రతిపాదనలు

జిల్లాలోని 42 బీసీ వసతి గృహాలు ఉండగా, వాటిలో 31 వసతి గృహాల భవనాలను మరమ్మతు చేసేందుకు రూ.6 కోట్లు 60 లక్షల 60 వేలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శ్రీదేవి తెలిపారు. అధిక శాతం వసతిగృహాల భవనాలకు శ్లాబులు దెబ్బతిన్నాయని గుర్తించామన్నారు. రావికమతం బీసీ వసతి గృహం భవన మరమ్మతుల కోసం రూ.30 లక్షల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని ఆమె తెలిపారు. జిల్లా కలక్టర్ చొరవతో 4,500 మంది విద్యార్థినులకు దుప్పట్లు, జంబుఖానాలు, దోమతెరలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వసతిగృహం మేట్రిన్ లలిత తదితరులు పాల్గొన్నారు.

సుద్ద క్వారీపై ప్రజాభిప్రాయ సేకరణ

సమస్యలు లేకుండా చూడాలని

స్థానిక ప్రజల విన్నపాలు



బెన్నవోలులోని ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో అయిషా

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలులో సుద్ద క్వారీ (వైట్ క్లే)పై శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభ ప్రశాంతంగా ముగిసింది. అనకాపల్లి ఆర్డీవో అయిషా అధ్యక్షతన నిర్వహించిన సభలో స్థానిక నాయకులు, వైట్ క్లే క్వారీయింగ్‌పై గ్రామానికి వచ్చే ఆదాయం, దానివల్ల స్థానికులకు కలిగే ఉపాధి, ఇతర సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఆర్డీవో అయిషా వైట్ క్లే తవ్వకాలకు సంబంధించి వచ్చే ఆదాయం గురించి వివరించారు. అలాగే తవ్వకాలపై ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని హామీ ఇచ్చారు. సుద్ద కొండపై స్థానికంగా కొన్ని కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, మైనింగ్ వల్ల వారు ఉపాధి కోల్పోకుండా చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులు విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ కొండపై ఆధారపడిన యాదవ కుటుంబాలకు కూడా ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామం మధ్య నుంచి సుద్ద తరలింపు ఉండకూడదని, క్వారీకి అనుమతి ఇస్తే స్థానికులకు ఉపాధి కల్పనతో పాటు పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇక ఈ క్వారీకి సంబంధించి తొలుత కొందరు గ్రామంలో మైనింగ్‌నకు అనుమతి ఇవ్వవద్దని, సుద్ద కొండపై ఆధారపడిన వారిని ఇబ్బందుల పాలు చేయవద్దని, కాలుష్య సమస్యలు పెరిగిపోతాయంటూ అధికారుల ఎదుట తమ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల అభిప్రాయాలను అధికారులు నోట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వైట్ క్లే తవ్వకాలకు అనుమతి పొందిన సంస్థ డైరెక్టర్ చల్లా రవిబాబు, సుద్ద తవ్వకాల వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ శాఖ అధికారి ఐ.సూర్యకళ, తహశీల్దార్ అంబటి రామారావు పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా సీఐ అప్పలరాజు, ఎస్ఐ నాగకార్తీక్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకోండి

» బీపీఎస్ పథకంలో అవకాశం

» మునిసిపల్ కమిషనర్ సురేంద్ర



నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చిందని పుర పాలక కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31వ తేదీకి నిర్మాణం పూర్తి చేసిన భవనాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. అభ్యంతరం లేని అక్రమ కట్టడాలు, మునిసిపాలిటీ ప్లాన్ అనుమతులను అతిక్రమించి నిర్మించిన భవనాలు, సెట్ బ్యాక్ స్థలం వదలనివి, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు. ప్లాన్ లేకపోతే బ్యాంకు రుణాలు మంజూరు చేయరని, క్రయవిక్రయాలకు ఆటంకంగా ఉటుందని స్పష్టం చేశారు. పురపాలక ప్లాన్ అనుమతి లేని భవనాలకు 200 శాతం ఆస్తి పన్ను పెనాల్టీ పడుతుందన్నారు. బీపీఎస్ పథకంలో క్రమబద్ధీకరించుకుంటే ఇటువంటి సమస్యలు పోతాయన్నారు. అనుమతి లేని భవనాలు కూల్చేస్తారన్న భయం కూడా తొలగిపోతుందన్నారు. బీపీఎస్ పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

త్వరలో ఎన్టీఆర్ ప్రజావేదిక భవనం

గొలుగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చీడిగుమ్మల గ్రామంలో ఎన్టీఆర్ ప్రజావేదిక భవనం త్వరలో ప్రారంభిస్తామని నర్సీపట్నం మునిసిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ తెలిపారు. ఈ భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ గ్రామ అధ్య క్షుడు కామిరెడ్డి గోవిందతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. త్వరలో భవనాన్ని ప్రారంభించడంతో పాటు మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహం కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కూరుకుపోయిన లారీ

రావికమతం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం ఫైర్ స్టేషన్ సమీపంలో లారీ కూరుకుపోయింది. పీడీఎస్ బియ్యం లోడుతో ఎంఎల్ఎస్ పాయింట్‌కు శనివారం వచ్చిన లారీ, తిరిగి వెళ్తుండగా ఫైర్ స్టేషన్‌కు దాటాక బీఎన్ రోడ్డు ఎక్కే క్రమంలో బురద గొయ్యిలో కూరుకుపోయింది. ఎంత శ్రమించినా లారీ పైకి రాకపోవడంతో చివరికి ఎక్స్‌కవేటర్‌ను రప్పించారు. మేదర కాలనీ వాడుక నీరు పోయేందుకు డ్రైనేజీ సౌకర్యం లేక బీఎన్ రోడ్డు అనుకొని వస్తుంది. దీంతో గోడౌంకు వెళ్లే మార్గం వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

పాఠశాలలో ప్రత్యేకాధికారి తనిఖీలు

రోలుగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి శనివారం తనిఖీలు చేశారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్విజ్ పోటీల్లో రోలుగుంట విద్యార్థిని ప్రతిభ

రోలుగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టార్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్విజ్ పోటీల్లో రోలుగుంట జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబర్చింది. బాలల దినోత్సవం సందర్భంగా డివిజన్ స్థాయిలో ఉన్న అన్ని జడ్పీ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. రోలుగుంట పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.పెర్సిస్ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు బాలిక పెర్సిస్‌ను జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. హెచ్ఎం టీవీ శేషగిరిరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు క్రమశిక్షణ అవసరం

దేవరాపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యలో లక్ష్యాలను సాధించగలమని ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థి భవిష్యత్ లక్ష్యాలు, క్రమశిక్షణపై శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం విద్యార్థి సెల్ ఫోన్, మత్తు పదార్థాల వైపు మల్లితే భవిష్యత్ బుగ్గిపాలవుతుందని హెచ్చరించారు. క్రమశిక్షణ జీవిత గమ్యానికి మార్గం చూపుతుందన్నారు. అలాగే క్రమశిక్షణ సమాజంలో మంచి పౌరుడుగా గుర్తింపు తెస్తుందని ఆయన చెప్పారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రష్యా బృందం పర్యటన

నర్సీపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రష్యా దేశానికి చెందిన రుసల్ కంపెనీ ప్రతినిధులు నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. కళాశాల శనివారం వచ్చిన బృందానికి విద్యార్థులు రష్యన్ భాషలో స్వాగతం పలికారు. విశాఖపట్నంలో శుక్రవారం జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రుసల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విశాఖపట్నం పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి మెటలర్జీ శాఖలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. అలాగే నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు రుసల్ కంపెనీలో ఉపాధి అవకాశాలు సాధ్యాసాధ్యాలు తెలుసుకోవడానికి వచ్చారు. కళాశాలలో మైనింగ్ విభాగానికి సంబంధించిన ల్యాబ్‌లు, సౌకర్యాలు పరిశీలించారు. కంపెనీలో సౌకర్యాలను విద్యార్థులకు తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ అందించి మంచి జీతం ఇచ్చి, భోజనం వసతి కల్పిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తాతాజీ, మైనింగ్ శాఖ అధిపతి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న రుసల్ కంపెనీ ప్రతినిధులు

సేవా కార్యక్రమాలతోనే మంచి గుర్తింపు

రావికమతం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతోనే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు కొనియాడారు. మండలంలోని టి.అర్జాపురం సర్పంచ్ మడగల ఫాల్గుణ సొంత నిధులు రూ2.5 లక్షలతో కైలాస వాటికలో షెడ్, వాటర్ ట్యాంకు, విద్యుత్ మోటారు, స్నానాలకు పది ట్యాప్‌లు తదితర సౌకర్యాలు కల్పించారు. వాటిని శనివారం కొండనాయుడు, సర్పంచ్ ఫాల్గుణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానంలోకనీస సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్న తరుణంలో సర్పంచ్ ఫాల్గుణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మరు భూమిలో చేసే సేవలకే ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు. సర్పంచ్ ఫాల్గుణను స్ఫూర్తిగా తీసుకుని అవకాశం ఉన్నవారు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాతాళ సత్యనారాయణ, జనసేన గ్రామ అధ్యక్షుడు ఎస్.శివ, తల్లిదండ్రుల కమిటీ మాజీ చైర్మన్ పి.అంజి, వార్డు సభ్యుడు పడాల కృష్ణ, పాల సంఘం అధ్యక్షులు దేవుళ్లు, నాయకులు జి.కృష్ణనాయుడు, ఇల్లపు శివ, ఎం.శ్రీను పాల్గొన్నారు.



కైలాస వాటికలో శివుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నాయకులు

గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక ప్రభుత్వ ప్రైవేటు కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ఎంఎస్ఎల్ జోగేశ్వరి, పోటీల నిర్వాహకులు, లెక్చరర్ కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో లక్ష దీపారాధన



శివాలయం ఆవరణలో దగదగా మెరిసిపోతున్న దీపాలు

కృష్ణాదేవిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట శివాలయం వద్ద శనివారం రాత్రి లక్ష దీపారాధన కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా కార్తీకమాసం ఏకాదశి పర్వదినం రోజున లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించడం అనవాయితీ. ఈ మేరకు ఆలయ కమిటీ, గ్రామస్థుల సహకారంతో దీపారాధన అత్యంతవైభంగా చేశారు. దీంతో పాతకృష్ణాదేవిపేట, చోద్యం, సిహెచ్.నాగాపురం, కొంగసింగి, లింగంపేట, రత్నంపేట, పాడి తదితర గ్రామాల నుంచి మహిళలు హాజరై త్రిసూళం, శివలింగం, ఓం తదితర ఆకారాలతో దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులకు పులిహోరా, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

చౌడువాడలో పుస్తక ప్రదర్శన

కె.కోటపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ గ్రామంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు మాట్లాడుతూ పిల్లలకు పుస్తక పఠన పై అవగాహన కల్పించాలన్నారు. వారికి కథలు, బొమ్మల పుస్తకాలు అందుబాటులో ఉండేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయ అధికారిణి ఎం.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై కార్యదర్శులకు శిక్షణ

నర్సీపట్నం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పచ్చదనం-పరిశుభ్రతపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. సీఆర్పీలు సందీప్, శ్రీనివాసరావు సర్పంచులు, కార్యదర్శులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతీ పంచాయతీ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని వారు సూచించారు. అలాగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, ఈవోపీఆర్డీ రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి

దేవరాపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంపద కేంద్రాలను వినియోగిస్తే పారిశుధ్యం మెరుగుపడుతుందని మండల ప్రత్యేక అధికారి మంజులవాణి తెలిపారు. మండల కేంద్రంలో సంపద కేంద్రాల వినియోగం-వాటి నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లాప్‌మిత్రలు, పారిశుధ్య కార్మికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో సువర్ణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖర్, కార్యదర్శి బంటు ఉమాదేవీ, సర్పంచ్ పెంటమ్మ పాల్గొన్నారు. బి.కింతాడలో సర్పంచ్ బాబూరావు పారిశుధ్యంపై ప్రతిజ్ఞ చేయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మంజులవాణి

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

మాడుగుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గవరవీధిలో కొలువుదీరిన గౌరీపరమేశ్వరులను పుర వీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. అంతకు ముందు మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన నిర్వహించారు. సీతారామాలయం చైర్మన్ బోడ్డేటి శ్రీను, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు అందుకున్న గౌరీపరమేశ్వరులు

పెదనందిపల్లిలో సత్యనారాయణస్వామి వ్రతాలు

దేవరాపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో శనివారం సత్యసాయి సత్యనారాయణ సామూహిక వ్రతాలు జరిగాయి. రావాడ శశిభూషణరావు ఆధ్వర్యంలో 150 మంది భక్తులు సామూహిక వ్రతాలు చేశారు. సత్యసాయి సంఘ ప్రతినిధులు కసిరెడ్డి అప్పలనాయుడు, సుధాకర్, మౌళి, రవిశంకర్ పాల్గొన్నారు.


పెట్టుబడుల సదస్సు సూపర్ హిట్



పారిశ్రామికవేత్తలతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్



సదస్సులో ప్రసంగిస్తున్న లోకేశ్



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చిత్రంలో మంత్రులు లోకేశ్, రవికుమార్, తదితరులు

విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు అధిక సంఖ్యలో తరలి రావడంతో సందడిగా మారింది. అంచనాలకు మించి పెట్టుబడులు రావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలతో ఆయన ఉత్సాహంగా చర్చలు జరిపారు. ముగింపు సదస్సులో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి


స్టాల్స్ వద్ద ప్రతినిధులు


సీఐఐ సదస్సులో పాల్గొన్న టీడీపీ నాయకులు


అమరావతి నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు



శ్రీసిటీలో కంపెనీల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం


కొమ్ము నృత్యం చేస్తున్న కళాకారులు


సదస్సుకు వచ్చిన వారితో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సెల్ఫీ



పారిశ్రామికవేత్తలతో మంత్రి సంధ్యారాణి, రాయపాటి శైలజ


సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు


ఫుడ్ కౌంటర్ వద్ద ప్రతినిధులు



తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

బిందు సేద్యం వైపు మొగ్గు

... 5వ పేజీ తరువాయి

మండల స్థాయి అధికారులు పరిశీలన అనంతరం యూనిట్లు మంజూరు చేస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే బిందు సేద్యం పరికరాలు మంజూరు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఆగస్టు నెల నుంచే కొత్త యూనిట్లు మంజూరు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దేవరాపల్లి, కె.కోటపాడు, సబ్బవరం, చీడికాడ, రావికమతం, అనకాపల్లి, మాడుగుల, చోడవరం, కోటవురట్ల, రోలుగుంట, నర్సీపట్నం, మాకవరపాలెం గొలుగొండ, నాతవరం మండలాల్లో రకరకాల కూరగాయల సాగు చేస్తున్నారు. ఎక్కువగా వంగ, బీర, బెండ, టమాటా, బీన్స్ వంటి కూరగాయల సాగు చేస్తున్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల్లో ఉద్యాన పంటలైన తమలపాకులు, అరటి, జామ, మామిడి, కొబ్బరి, చెరుకు, డ్రాగన్, బొప్పాయి వంటి పంటల సాగు చేస్తున్నారు. గత ఏడాది నుంచి ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాయితీలు అందిస్తుండడంతో రైతులు మరింత ఆసక్తితో బిందు, తుంపర్ల సేద్యానికి ప్రోత్సాహకాన్ని అందిస్తున్నారు.

రాయితీపై పరికరాలు అందజేత

బిందు, తుంపర్ల సేద్యం చేసే సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ (ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి గల) రైతులకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మైక్రో ఇరిగేషన్ శాఖ ద్వారా పరికరాలను అందిస్తోంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.2.18 లక్షలు వరకు బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. ఐదు నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం గరిష్ఠగా, ఆపైన సాగు చేసే రైతులకు 50 శాతం రాయితీ అందిస్తున్నారు. కాగా బిందు, తుంపర్ల సేద్యంతో పంటకు సరిపడా నీరు అందుతుందని, దీని వలన దిగుబడులు సాధారణం కంటే ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీ లక్ష్మి తెలిపారు.

ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

శంకుస్థాపన చేయాల్సి ఉందని, కొన్ని సాంకేతిక అంశాల కారణంగా వాయిదా పడిందన్నారు. గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడం వల్లనే గూగుల్ విశాఖకు వచ్చిందని, దాంతో మరో ఐదారు డేటా సెంటర్లు రానున్నాయన్నారు. రిలయన్స్ సంస్థ ఒక గిగావాట్ సెంటర్‌కు ఎంఓయూ చేసిందన్నారు.

అది ఎక్స్‌పీరియన్స్ సెంటర్

విశాఖలో ఐటీ ఉద్యోగులకు సోషల్ లైఫ్ కావాలని, ఈ నేపథ్యంలోనే లూలూ మాల్‌ను పెడుతున్నామన్నారు. అది షాపింగ్‌కే పరిమితం కాదని, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ స్టీల్, కొత్తగా అనకాపల్లి జిల్లాలో వచ్చే ఆర్సెలర్ మిట్టల్ ద్వారా దేశంలోనే అత్యధిక స్టీల్ తయారవుతుందన్నారు. మిట్టల్ స్టీల్ కోసం ఎన్ఎండీసీ నుంచి ముడిఇనుమును పైపులైన్ ద్వారా తెప్పించడానికి ప్రధాని నరేంద్రమోదీతో ఆ శాఖకు చెప్పించాల్సి వచ్చిందని వివరించారు. వారు దశల వారీగా రూ.1,35,000 కోట్ల పెట్టుబడి పెడతారన్నారు. తూర్పు తీరంలో పోర్టుల ద్వారా పశ్చిమ తీరంలో పోర్టులకు కనెక్టివిటీ పెంచుతున్నామని, దానిద్వారా లాజిస్టిక్స్ వ్యయం తగ్గుతుందన్నారు. దసపల్లా , నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ భూములు చేతులు మారిపోయాయని, వాటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని ఓ విలేకరి ప్రశ్నించగా, చట్టప్రకారం ముందుకు వెళతామన్నారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఎలా జరుగుతుంది?

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆగినట్టా?, లేదా?...అని ఓ విలేకరి ప్రశ్నించగా సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కేంద్రం రూ.12 వేల కోట్లు ఇచ్చింది దేనికని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం ఉంటే ఇస్తారా?...అని నిలదీశారు. ప్రైవేటీకరణ ఆగిందని ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి చెప్పాలా? అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల విద్యుత్ బకాయిలను ఈక్విటీగా మార్చిందని, నీటి పన్ను, ఆస్తి పన్ను వదులుకుందని, సెక్యూరిటీ కూడా ఇచ్చిందని, ఇదంతా దేని కోసమని ప్రశ్నించారు. పనిచేయకుండా పడుకుంటే నష్టాలు రావా? అన్నారు. అందుకే కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం


స్క్రాప్ దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు, పొగ

లంకెలపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):లంకెలపాలెం ఇండస్ట్రియల్ ఏరియాలోని స్క్రాప్ దుకాణంలో శనివారం అగ్నిప్రమాదం జరిగి రూ.మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఇండస్ట్రియల్ ఏరియాలో మోహన్‌రెడ్డి అనే వ్యాపారి స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో కూలీలు కేబుల్‌ను కాల్చి కాపర్ వైర్లను వేరు చేస్తుండగా అగ్ని రవ్వలు సమీపంలో ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములు, వ్యర్థాలపై పడి ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. దీంతో దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళన చెందారు. రాంకీ, అనకాపల్లి అగ్నిమాపక శకటాలు చేరుకొని గంటన్నర పాటు శ్రమించడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. పరవాడ సీఐ మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 3 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం... crime news

చెరువులో పడి తాపీ మేస్త్రీ మృతి

కె.కోటపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఏ.కోడూరు పోలీసు స్టేషన్ పరిధిలో వారాడ గ్రామంలో జరిగింది. మృతుని కుమారుడు బొత్స శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ ముకుంద అందించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని వారాడ గ్రామానికి చెందిన బొత్స ముత్యాలు (66) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 13వ తేదీన ఉదయం బహిర్భూమికి వెళ్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాలన్నీ వెతికామని, అయినప్పటికీ తన తండ్రి ఆచూకీ లేదని అతని కుమారుడు బొత్స శివ తెలిపారు. శనివారం రంగరాజు చెరువులో శవమై తేలి ఉండగా స్థానికులు చూసి తమకు సమాచారం ఇచ్చారన్నారు. ముత్యాలు భార్య ఇటీవల మృతి చెందగా.. కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏ.కోడూరు ఏఎస్ఐ ముకుంద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీబిడ్డ ఆత్మహత్య కేసులో భర్త సహా నలుగురి అరెస్టు

చోడవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా సంచలనం సృష్టించిన తల్లీబిడ్డ ఆత్మహత్య కేసులో వివాహిత భర్త ఉపాధ్యాయుడు సహా నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శనివారం తెలిపారు. స్థానిక కనక మహాలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోరెడ్డి ఉమామహేశ్వరరావు, అతని సోదరి రూపవతి, బావమరిది ముదిలి మణికంఠ, అతని తల్లి ముదిలి విజయమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆమె తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా తిరువాడ గ్రామానికి చెందిన పోరెడ్డి ఉమామహేశ్వరరావు అదే గ్రామానికి చెందిన వీణతో ప్రేమ వివాహం జరిగిన సంగతి తెలిసిందే. వీరికి ఆరునెలల బాబు ఉన్నాడు. వీణ ఈనెల 12వ తేదీ సాయంత్రం భర్త లేని సమయంలో చిన్నారి పసిబిడ్డను చంపిన అనంతరం ఆమె ఉరివేసుకుని మృతిచెందిన సంగతి విదితమే. వీణ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై 304 బీ సెక్షన్ కింద కేసును పోలీసులు నమోదు చేశారు. వారిని శనివారం అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ శ్రావణి వివరించారు.

విద్యార్థి మృతి ఘటనలో ఐదుగురి అరెస్టు

మునగపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో డావిన్సీ స్కూల్ ఈతకొలనులో విద్యార్థి మృతి కేసులో ఐదుగురుని అరెస్టు చేసినట్టు సీఐ ఎస్.ధనుంజయరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 13వ తేదీన డావిన్సీ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్న జనపరెడ్డి మోక్షిత్‌సందీప్ ఈతకొలనులో మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. విద్యార్థి తల్లి జనపరెడ్డి నాగశ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా శనివారం అదే పాఠశాలలో స్విమ్మింగ్ పూల్ కోచ్‌గా పనిచేస్తున్న చోడిపల్లి దేముడు, స్విమ్మింగ్ ఇన్‌చార్జి టీచర్ మోటూరి యమున, మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ జెర్రిపోతుల రమణాజీ, స్కూల్ బస్సు డ్రైవర్ వందిరి శివప్రసాద్‌లను అరెస్టు చేశామని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	605
విజయనగరం	609
శ్రీకాకుళం	609